సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 23, అక్టోబర్, 2023



ఉద్దానం కొబ్బరికి ఉత్తరాది దెబ్బ

ఉద్దానం కొబ్బరిరైతులు కుదేలవుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గడంతో నష్టపో తున్నారు. - IIలో



బలహీన వర్గాల ఆశాజ్యోతి..

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గాజులకొల్లి వలసలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. - IIలో

నేటి పోలీసు స్పందన రద్దు

శ్రీకాకుళం క్రైమ్ : విజయ దశమి సెలవు దినం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ జి.ఆర్. రాధిక తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. మళ్లీ వారం యథాతథంగా కొనసాగుతుందన్నారు.

న్యూస్‌రీల్

నేడు ఉత్తరాంధ్రస్థాయి క్విజ్ పోటీలు

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీ లక్కవరంలో సోమవారం ఉత్తరాంధ్ర స్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పూజా కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రూపులో ఐదుగురు సభ్యులు ఉండాలని, వివరాలకు 96765 00204 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పత్రికొమ్మల పండుగ



పత్రికొమ్మల పండుగలో రైతులు

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లాలో ఆదివారం దసరాపండుగ సందర్భంగా పత్రికొమ్మల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కాటమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో సుమారు రెండు వేలమంది భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాల రైతులంతా పత్రికొమ్మలు వరుసగా పెట్టి పూజలు చేశారు. అనంతరం కొమ్మలపై ముగ్రాటలు వేశారు. వీటిని పంటపొలాల్లో వేస్తారు.

అఖండ దీపారాధన



శివలింగాకృతిలో దీపాలు

కంచిలి: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా కంచిలి రైల్వేస్టేషన్ ఆవరణలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఆదివారం సాయంత్రం అఖండ దీపారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని దీపాలు వెలిగించారు. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న మన్యం జేసీ



అమ్మవారిని దర్శించుకుంటున్న జేసీ గోవిందరావు

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల కల్పవల్లి కోటబొమ్మాళి కొత్తమ్మతల్లిని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోవిందరావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈఓ వి.రాధాకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి అభిషేకం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

జగన్నాథపురంలో కార్డన్ సెర్చ్



కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పోలాకి: మండలకేంద్రం పోలాకిలోని జగన్నాథపురం(కొత్తపేట)లో ఆదివారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నరసన్నపేట సీఐ బి.ప్రసాద్ ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్ఐలు, 30మంది సిబ్బంది ఆపరేషన్‌లో పాల్గొన్నారు. 80 ఇళ్లల్లో నిశితంగా తనిఖీలు చేపట్టి పలువురు అనుమానితులను విచారించారు. రికార్డులు సరిగ్గా లేని ఐదు బైక్‌లను గుర్తించి సీజ్ చేశారు. అయితే ఉదయానికే గ్రామంలోకి ఇంతమంది పోలీసులు ప్రవేశించి తనిఖీలు చేయటంపై ఒక్కసారిగా ఆందోళన వ్యక్తమైంది. ఒక దశలో రాజకీయ నాయకులు సైతం ఏం జరిగిందో అని ఆరాతీశారు. కాసేపటి తరువాత సాధారణంగా అనుమానితులను గుర్తించేందుకు, ప్రజలను అప్రమత్తం చేసేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహించామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని పోలీసులు ప్రకటించారు.



పాతపట్నంలో దుర్గాదేవిగా నీలమణిదుర్గ



కంచిలిలో జగన్మాత అవతారంలో కంచమ్మతల్లి



శ్రీకాకుళం నానుబాలవీధిలో మహిషాసుర మర్దినిగా విజయదుర్గ

అవతార స్వరూపిణి ఐశ్వర్య ప్రదాయిని



శ్రీకాకుళం మొండేటివీధిలో దుర్గాదేవిగా లలితాదేవి



శ్రీకాకుళం గుడివీధిలో దుర్గాదేవిగా రాజరాజేశ్వరీదేవి



దసరా సంబరం

మా ఊళ్లో ఇలా..



- దసరా వేడుకలపై సిక్కోలులోని రాష్ట్రేతరుల మనోగతం

శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్రం వేరు.. భాష వేరు.. సంప్రదాయాలు వేరు. కానీ ఉన్న ఊరే సొంత ఊరుగా ఇక్కడి సంప్రదాయాలే తమవిగా మార్చుకుని వారంతా మనలో ఒకరిగా కలిసిపోయారు. అచ్చ తెలుగువారిలో పండుగ సరదాల్లో పాలుపంచుకుంటున్నారు. దసరా నవరాత్రులు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయి. కానీ పండుగ సంప్రదాయాలు ఒక్కోచోట ఒక్కోలా ఉంటాయి. కానీ శ్రీకాకుళం వచ్చి నివసిస్తున్న రాష్ట్రేతరులు ఇక్కడి సంప్రదాయాలనే గౌరవించి, ఆచరిస్తుండటం విశేషం. దసరా నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో పండుగను ఎలా జరుపుకుంటారో వారి మాటల్లోనే..

పశ్చిమబెంగాల్



దేశంలోనే దసరా ఉత్సవాలకు పశ్చిమ బెంగాల్ పెట్టింది పేరు. కోల్‌కతా కాళీమాత ఉత్సవాలు అక్కడ అంగరంగ వైభవంగా జరుగుతుంటాయి. ముఖ్యంగా వివిధ ఆకృతుల్లో రూపొందించే భారీ సెట్టింగులు ఇక్కడి ప్రత్యేకత. సినిమా సెట్టింగ్‌లకు తీసిపోని విధంగా ఒక్కో పెండాల్‌ను లక్షలాది రూపాయల వ్యయంతో రూపొందిస్తుంటారు.

కేరళ



ఇక్కడ దుర్గామాతను పూజిస్తే అక్కడ సరస్వతీ మాతను పూజిస్తారు. జంతు బలులు ఉండవు. అమ్మవారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. కుంకుమ పూజలు నిర్వహిస్తారు.

ఒడిశా

దసరా సమయంలో కటక్, బరంపూర్‌లో సుమారు 200 వరకు దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి ఇంట్లో నిష్ఠగా పూజలు జరుగుతాయి. ప్రత్యేకంగా రూపొందించిన విగ్రహాలను చూసేందుకు భారీగా భక్తులు తరలి వస్తుంటారు. ముఖ్యంగా కటక్‌లో పోటాపోటీగా బొమ్మలు ఏర్పాటు చేస్తారు. కటక్‌లో ఉన్న కాళికాదేవిని కటక్ చండీగా పిలుస్తారు.

రాజస్థాన్, గుజరాత్



ఇక్కడ అన్ని పండగల మాదిరిగానే దసరా పండగ కూడా జరుపుతారు. అయితే ఆంధ్రాలో ఇచ్చిన ప్రాధాన్యత ఉండదు. ఈ సమయంలో దాండియా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

మహారాష్ట్ర



ఇక్కడ 10 రోజుల పాటు పండుగ జరుపుతారు. పూజలు చేస్తు ప్రతిరోజూ ఉపవాసం ఉంటారు. రాత్రిపూట రామాయణం, రామలీలాపై నృత్యాలు చేస్తుంటారు. ఆఖరి రోజున రావణాసురుడు, కుంభకర్ణుడు, మేఘనాథుడి దిష్టిబొమ్మలను 50 అడుగుల ఎత్తున ఏర్పాటు చేసి లక్షలాది మంది జనాల సమక్షంలో దహనం చేస్తారు. ఇది రావణుడిపై రాముడి విజయంగా భావించి విజయదశమిగా జరుపుకొంటారు.

బొమ్మలకొలువు..



దసరా సందర్భంగా దుర్గాదేవి, లక్ష్మీ, సరస్వతులను కొలుస్తాం. ముఖ్యంగా బొమ్మల కొలువులు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం. ప్రతి ఇంట్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేసి సందడి చేస్తుంటాం.

– సుబ్రహ్మణ్య కదిరేసన్, తమిళనాడు

ఊరంతా సందడి..



పశ్చిమబెంగాల్ తర్వాత ఒడిశాలో దసరా ఉత్సవాలు భారీ ఎత్తున జరుగుతాయి. కటక్‌లో ప్రతి వీధిలో దుర్గాదేవి విగ్రహాలు కొలువుదీరుతాయి. ఇందుకోసం లక్షలాది రూపాయలు వెచ్చిస్తుంటారు. ఊరంతా సందడిగా ఉంటుంది. విద్యుత్ దీపాలంకరణలో వీధులు, ఇళ్లన్నీ కళకళలాడుతుంటాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు కూడా అందిస్తారు. ఆంధ్రాలో వినాయక పూజలు తరహాలో ఒడిశాలో దసరా వేడుకలు జరుగుతాయి.

– తుమ్మిడి గదాదర్, కటక్, ఒడిశా



ఆలయాల్లోనే..



కేరళలో దసరా పండగ అంటే తెలియదు. అక్కడ ఉండే ఆంధ్రా వారు మాత్రం ఆ రోజున ఆలయాలకు వెళ్లి పూజలు చేసుకుంటారు. ఆంధ్రాలో దసరా ఉత్సవాలు బాగా జరుగుతాయి. కేరళలో కేవలం సరస్వతీదేవినే ఈ సమయంలో పూజిస్తారు. చదువుకు సంబంధించినంత వరకు మాత్రమే ప్రాధాన్యత. ఇక్కడ మాత్రం ఆయుధపూజ, అక్షరాభ్యాసాలు ఉంటాయి. – కుమార్, కేరళ

ఉపవాసం తప్పనిసరి..



దసరా పదిరోజులు అందరం ఉపవాసాలు చేస్తాం. ఇక్కడ టౌన్ హాలు వద్ద రాజస్థానీ మిలన్ ఆధ్వర్యంలో ఏటా దసరా వేడుకలు నిర్వహిస్తాం. రాత్రిపూట దాండియా ఆడుతాం. ఆఖరి రోజున విజయదశమి నాడు భారీ ఎత్తున రావణ దహనం జరుగుతుంది.

– విక్రమ్‌సింగ్, మహారాష్ట్ర

మార్కెట్‌కు పండగ కళ

శ్రీకాకుళం కల్చరల్: దసరా పండగ నేపథ్యంలో మార్కెట్లు ఆదివారం కిటకిటలాడాయి. పూజకు అవసరమైన సామగ్రి, పత్రి, పూలు, ఆయుధ పూజ సామాన్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో శ్రీకాకుళం పెద్దమార్కెట్ కిక్కిరిసింది. నిమ్మకాయలు, నల్ల జీడిపిక్కలు కొనుగోళ్లు జోరుగా సాగాయి.

స్నానానికి దిగి తిరిగిరాని లోకాలకు..!

- నాగావళి నదిలో గల్లంతై బీటెక్ విద్యార్థి మృతి
- లక్కుపురంలో విషాదం



వెంకటనారాయణ మృతదేహం

బూర్జ : మండలంలోని డొంకలపర్త పంచాయతీ ఏటిఒడ్డుపర్త (వైపర్త) గ్రామ సమీపంలో నాగావళి నదిలో గల్లంతై బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం మర్రికుంటపల్లి గ్రామానికి చెందిన మృతి చెందిన కల్లూరి వెంకటనారాయణ (25) విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో శనివారం బూర్జ మండలంలోని లక్కుపురంలోని స్నేహితుల ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం స్నేహితులతో కలిసి ఏటిఒడ్డుపర్త వద్ద నాగావళి నదిలో స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్నేహితులు భయాందోళనకు గురై గ్రామస్తులకు విషయం చెప్పడంతో అందరూ కలిసి వెతికారు. అయినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు, పార్వతీపురం మన్యం జిల్లా అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి వెతకడంతో మృతదేహం లభ్యమైంది. వెంకటనారాయణకు తల్లిదండ్రులు, అక్కాచెల్లెలు ఉన్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఎం.వి.రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

- కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం భూ సేకరణ అధికారి(ఎస్‌డీసీ)గా పి.పద్మావతినినియమించింది. ఇప్పటి వర కు కొవ్వాడ ఎస్‌డీసీగా పనిచేసిన పి.మురళీకృష్ణను అల్లూరి సీతారామరాజు జిల్లా కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు.
- జెడ్పీ సీఈఓగా ఎం.అప్పారావు నియమితులయ్యారు. ఈయన చీపురుపల్లి ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం జెడ్పీ సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్.వెంకట్‌రామన్ యథావిధిగా తన డిప్యూటీ సీఈవో హోదాలో కొనసాగనున్నారు. కలెక్టరేట్‌లోని కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా ఆర్.వి.సూర్యనారాయణ నియమితులయ్యారు. ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన ఎం.సుమబాలను విజయనగరం కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీగా నియమించారు.
- ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా కె.జి.వేణిని నియమించారు. ఇప్పటి వరకు ఎఫ్‌ఎస్‌ఓగా పనిచేసిన టి.నవరమ్మను మంగళగిరిలోని సీసీఎల్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా నియమించారు.
- పలాస ఆర్డీవోగా పనిచేసిన టి.సీతారామ్మూర్తిని విశాఖపట్నం భూ సేకరణ విభాగానికి బదిలీ చేశారు. పాలకొండ ఆర్డీవోగా ఎం.లావణ్యను నియమించారు.
- గతంలో డీఆర్‌ఓగా పనిచేసిన ఎం.రాజేశ్వరిని విజయనగరం జిల్లా విపత్తుల మేనేజ్‌మెంట్ అధికారిగా నియమించారు.

అమ్మవారి సన్నిధిలో మంత్రి అప్పలరాజు



పలాసలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో ఆదివారం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, శ్రీదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు అమ్మవార్ల వేషధారణలతో ఆకట్టుకున్నారు. – కాశీబుగ్గ

వాహన పూజలకు బందోబస్తు




బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ వినోద్‌బాబు

పాతపట్నం: దసరా ఉత్సవాల నేపథ్యంలో పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమ, మంగళవారాల్లో ఆయుధ, వాహన పూజ సందర్భంగా భారీ ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున సీఐ ఎం.వినోద్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా బారికేడ్లు సిద్ధం చేశారు. భక్తుల ప్రశాంతంగా వాహన పూజలు చేసుకోవాలని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈవో టి.వాసుదేవరావు కోరారు.


కొంగ..పులి..కుక్క..ఎలుగు

విదేశీ విహంగాలు వచ్చేశాయ్




తేలినీలాపురం పక్షుల విడిది కేంద్రానికి విదేశీ పక్షులు వచ్చేస్తున్నాయి. సైబీరియా ప్రాంతం నుంచి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షులు ఏటా సెప్టెంబర్‌లో ఇక్కడికి రావడం ఆనవాయితీ. ఈ ఏడాది మాత్రం కాస్త ఆలస్యమైంది. ప్రస్తుతానికి సుమారు 50 పక్షులు మాత్రమే చేరుకుని రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి పెలికాన్ 110, పెయింటెడ్ స్టార్క్ 15 పక్షుల వరకు చేరుకున్నాయి. –టెక్కలి

పులి తిరుగుతోంది జాగ్రత్త



ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాలో నమోదు కావడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సరిహద్దున గొప్పిలి గ్రామంలో ఆదివారం ఫారెస్ట్ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రి 7గంటలు దాటాక బయటకు రావొద్దని చెప్పారు. పగటి పూట సైతం ఒంటరిగా తిరగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. –మెళియాపుట్టి

బెంబేలెత్తిస్తున్న కుక్కలు



కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. టెక్కలి పాత జాతీయ రహదారి నుంచి పలు ప్రధాన కూడళ్లు, వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ పాదచారులను, వాహనచోదకులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. దీంతో పిల్లలను బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. – టెక్కలి

ఎలుగుబంటి హల్‌చల్



మండల కేంద్రం సంతబొమ్మాళిలో మూడు రోజులుగా ఎలుగు బంటి హల్‌చల్ చేస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామంలోని నాలుగు అరటిచెట్లను ధ్వంసం చేయగా, అంగన్‌వాడీ, హైస్కూల్ తరగతి గదుల్లోకి వెళ్లి వస్తువులను నాశనం చేసింది. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. –సంతబొమ్మాళి

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



వీరభద్రస్వామికి జ్ఞాపిక అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, లుకలాపు గోవిందరావులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు.

అరసవల్లిలో ప్రత్యేక పూజలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ నవరాత్రులు సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి అయ్యప్పస్వాములు, భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో ఆదిత్యున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆరోగ్యం కోసం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,26,400, విరాళాల ద్వారా రూ.74,954, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.75 లక్షలు వరకు ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

నందిగాం: మండలంలోని సుభద్రాపురం గ్రామానికి చెందిన పాలిన జయరాం జాతీయ రహదారిని దాటుతుండగా కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయరాం ఆదివారం ఉదయం రోడ్డు దాటుతుండగా పలాస నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కాలు విరగడంతో బాధితుడ్ని టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతపట్నంలో కొత్త రైల్వేగేటు



కొత్త గేటు నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక నీలమణిదుర్గ ఆలయం సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఉన్న గేటును తొలగించి పక్కనే కొత్త గేటు ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కొత్త గేటు కోసం రైల్వే ట్రాక్ వద్ద గేటు స్టాండ్, కేబుల్ వర్క్ పనులు చేపట్టారు. రైల్వే ఫ్లై ఓవర్ పనుల్లో భాగంగా హైవే సిబ్బంది, రైల్వే సిబ్బంది కలిసి ఈ పనులు చేపడుతున్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హైవే అధికారి రామకృష్ణ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

టెక్కలి రూరల్: మండలంలోని గూడెం పంచాయతీ సవరకిల్లి గ్రామ సమీప తోటల్లో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.21150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.

ఉద్దానం కొబ్బరికి ఉత్తరాది దెబ్బ

- నార్త్ ఇండియాలో తగ్గిన డిమాండ్
- దిగజారుతున్న ధరలు
- ఎగుమతుల్లో దూసుకుపోతున్న తమిళనాడు



కంచిలి వ్యాపార కేంద్రంలో కొబ్బరికాయల నిల్వలు

కంచిలి: ఉద్దానం కొబ్బరి రైతుల్లో దసరా సందడి కనిపించడం లేదు. నానాటికీ దిగజారుతున్న కొబ్బరి ధరలు రైతులను నిరాశకు గురి చేస్తున్నాయి. ఉత్తరాంధ్రలోనే పేరొందిన కంచిలి కొబ్బరి మార్కెట్‌లో దసరా, దీపావళి వ్యాపార లావాదేవీల సందడి ఈ ఏడాది కన్పించడం లేదు. ఉద్దానంతో పాటు కోనసీమ కొబ్బరికాయలకు ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గడమే ఇందుకు కారణం. ఉద్దాన ప్రాంతంగా పిలిచే టెక్కలి డివిజన్‌లోని ఏడు మండలాలతోపాటు రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం మండలాల్లో కలిపి సుమారు 36 వేల ఎకరాల్లో విస్తారంగా సాగుచేస్తున్న కొబ్బరి ఎగుమతి అవ్వాలంటే కంచిలి కేంద్రంగానే వ్యాపార లావాదేవీలు సాగుతుండేవి. ఏటా అక్టోబర్‌లో భారీ ఎత్తున క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. దసరా నవరాత్రి ఉత్సవాలు, దీపావళి పండగ సందర్భంగా ఉత్తరాది రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున చేపట్టే దుర్గా పూజలకు, బీహార్ రాష్ట్రంలో జరుపుకునే 'ఛట్ పూజ'కు కొబ్బరికాయలకు డిమాండ్ ఉంటుంది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, హర్యానా, బీహార్, ఒడిశా తదితర రాష్ట్రాలకు ఇక్కడి నుంచే కొబ్బరి కాయలు ఎగుమతి చేస్తుంటారు. ఈసారి మాత్రం కంచిలి మార్కెట్‌లో ఆ పరిస్థితి కన్పించడం లేదు.

తమిళనాడుకే ప్రాధాన్యం..

ఉద్దానం కొబ్బరికి దీటుగా దక్షిణాదిన తమిళనాడులో కొబ్బరి సాగు వృద్ధి చెందింది. దీంతో ఉత్తరాది రాష్ట్రాలు కొబ్బరిని కొనుగోలు చేసేటప్పుడు అన్ని మార్కెట్లు పరిశీలిస్తున్నారు. నాణ్యత, కాయ పరిమాణం, ధరలను పోల్చి తమిళనాడు వైపే మొగ్గు చూపుతున్నారు. అక్కడ సాగు విస్తీర్ణం పెరగడంతో ఉత్తరాది మార్కెట్‌కు పెద్ద ఎత్తున ఎగుమతులు చేస్తున్నారు. వెయ్యికాయలు రూ.10వేలు వరకు ధర పలుకుతున్నాయి. ఇక్కడ ధరలు మాత్రం ఆశాజనకంగా లేవు. గత నెల వరకు వెయ్యి కాయలు రూ.8వేలకు మించి పలకలేదు. దసరా పుణ్యమా అని ప్రస్తుతం వెయ్యి కాయలు రూ.11వేలకు చేరాయి. అయినా ఉత్తరాది రాష్ట్రాలు కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. గత ఏడాది ఈ సీజన్‌లో వెయ్యి కాయల ధర రూ.15వేలు వరకు ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

తగ్గిన ఎగుమతులు..

గతంలో ఈ సీజన్‌లో రోజుకు 40 నుంచి 50 లారీల కొబ్బరి ఉత్తరాదికి ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం ఉత్తరాదికి ఎగుమతులు నిలిచిపోయాయి. కేవలం ఒడిశా మార్కెట్‌కే కాయలు తరలుతున్నాయి. ప్రస్తుతం తోటల నుంచే ఒడిశా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు తప్ప కంచిలి మార్కెట్‌కు రావడం లేదు. దీంతో ఉద్దానంతో పాటు మిగతా మండలాల్లో కొబ్బరి రైతులు ఒడిశా, మిగతా చిల్లర మార్కెట్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది.



కాయలు ఒలుస్తున్న కూలీలు

ఆశాజనంగా లేవు..



ఏటా దసరా, దీపావళి సీజన్‌లో అయ్యే ఎగుమతులు ఈ ఏడాది లేవు. ఉద్దానంలో కొబ్బరి సాగు బాగున్నా ధరలు పతనమయ్యాయి. ఉత్తరాది మార్కెట్‌లో ఇక్కడి కాయలకు డిమాండ్ తగ్గింది. తమిళనాడులో ఇంతకన్నా చవగ్గా లభ్యం కావడంతో, ఉత్తరాది వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు.

– నరేష్‌కుమార్ అగర్వాలా(లల్లా), కొబ్బరి వ్యాపారి, కంచిలి


నిస్తేజంగా రైతులు..



దసరా పండగ సందడి కొబ్బరి రైతుల ముఖంలో కనిపించడం లేదు. దిగుబడులు మాట ఎలా ఉన్నప్పటికీ ధరలు ఆశాజనకంగా లేవు. దీంతో రైతు దిగాలు చెందుతున్నారు. గత ఏడాదితో పోల్చితే ధర బాగా పడిపోయింది. ఈ పరిస్థితిలో రైతుకు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– పొందల ఢిల్లీరావు, రైతు, సర్పంచ్, పెద్దకొజ్జిరియా గ్రామం

• అరుణవర్ణ శోభితం



సూర్యస్తమయం వేళ ఎంతో నిర్మలంగా ఉండే వినీలాకాశం ఒక్కసారిగా ఎరుపెక్కింది. ఆదివారం సాయంత్రం ఆకాశం అరుణ వర్ణంలోకి మారి కనువిందు చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడిమి, ఉక్కపోతకు గురిచేసిన సూరీడు సాంయంత్రం మేఘాల చాటుకు వెళ్లిపోవడంతో ఇచ్ఛాపురం వాసులు తమ సెల్‌ఫోన్‌లలో ఈ రమణీయ దృశ్యాన్ని బంధించారు.

– ఇచ్ఛాపురం రూరల్

ఇంటర్ స్టేట్ క్రికెట్ పోటీల విజేత శ్రీకాకుళం



ట్రోఫీతో విజేత శ్రీకాకుళం జట్టు

గార: మండలంలోని కె.మత్స్యలేశం పంచాయతీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఇంటర్‌స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ (20-20)లో శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హైదరాబాద్ జట్టుపై విజయకేతనం ఎగురవేసింది. రెండు రాష్ట్రాల నుంచి ఆరు జట్లు ఈ టోర్నీలో పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జశ్వంత్ (శ్రీకాకుళం), మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును క్రిస్టఫర్ (హైదరాబాద్), చరిత్ (శ్రీకాకుళం)లు గెలుచుకున్నట్లు ప్రకటించారు. బెస్ట్ బౌలర్లుగా ఆకాష్, భరత్, వరుణ్ అవార్డులు అందుకున్నారు. వీటిని బుద్ధా స్కూల్ చైర్మన్ బి.ఎర్రన్న, విశాఖపట్నం సీఐ ఇలియాస్ అహ్మద్, శైలేంద్ర అందజేశారు. కార్యక్రమంలో బత్తుల గోవింద, కిరణ్, సురేష్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



ట్రైబల్ ఫెడరేషన్‌కు ఎన్నికైన వారిని సన్మానిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

సారవకోట: గిరిజనులు ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని జాతీయ ట్రైబల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కుంభా ఉదయభాస్కర్ అన్నారు. ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన చౌదరి లక్ష్మీనారాయణను ఆదివారం సారవకోటలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బొంతు గ్రామంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి గిరిజన గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.హేమలత, రాష్ట్ర వైస్ చైర్మన్ జి.రమణమూర్తి, గేదెల హరికృష్ణ, చల్లా రామారావు, గుజ్జువాడ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్లకు పలకరింపు



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పాతికేళ్ల తర్వాత ఒకేవేదికపైకి చేరారు. అనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



గాజులకొల్లివలసలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ నవ భారత రాజ్యాంగ నిర్మాతగా ఉంటూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రరాజ్యంగా నిలబెట్టాలనే లక్ష్యంతో రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొండేటి కూర్మారావు, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బోసు మన్మథరావు, నత్తల కృష్ణ, దళిత సంఘం నాయకులు కళ్లేపల్లి రామ్ గోపాల్, కంఠం వేణు, టింగ రాజు, సవలాపురపు రాజా, సుజాత, యశోదమ్మ, రాజు, కో ఆర్డినేటర్లు నవిరి ప్రసాద్, నవిరి రవి, నవిరి రమేష్, సవళాపురపు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డేపల్లి రాజశేఖర్, కామిరెడ్డి రమణ, పేడాడ శ్యామ్‌సుందర్, గొంటి కృష్ణ, దుంపల శ్యామలరావు, సురవరపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో యువకుడు మృతి



మృతుడు రాజారావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలో పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురం గ్రామానికి చెందిన తమ్మినాన రాజారావు(35) కిడ్నీ సమస్యతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈయన కొన్నాళ్లుగా పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు పొందుతున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈయనకు భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు, గ్రామస్తులు కోరుతున్నారు.

విలువలతో కూడిన విద్య నేర్పాలి



శ్యామలను సత్కరిస్తున్న హిందీ మంచ్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: పిల్లలకు విలువలతో కూడిన విద్య నేర్పాలని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు అన్నారు. హిందీ మంచ్, తెరవే, పెన్షనర్ల సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఎండీపీ టాపర్, గణిత ఉపాధ్యాయిని డి.శ్యామలను ఆదివారం శ్రీకాకుళంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశ్రామిక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం కోర్సులో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న విశాఖ జిల్లాకు చెందిన శ్యామల అభినందనీయురాలని కొనియాడారు. హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనె శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9వ తరగతి విద్యార్థులకు ప్రవేశపెట్టిన ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కోర్సులో విశాఖ జీవీఎంసీ టీచర్‌గా విశేష ప్రతిభ కనబరిచి, విద్యార్థులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు తీసుకువెళ్లారని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, శ్యామల, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన హిందీ మంచ్ జిల్లా కార్యదర్శి రొంపివలస రామారావులను సత్కరించారు. కార్యక్రమంలో హిందీ మంచ్ అధ్యక్షుడు దొంతం పార్వతీశం, సీనియర్ ఉపాధ్యాయ సంఘం నేత ఎం.నీలాద్రిరావు, బి.ఉమామహేశ్వరరావు, మోహనరావు, వజ్రాల భగత్, కనుగుల సత్యం, గాంధీ, తెరవే సంస్థ ప్రతినిధులు ఇద్దిపాపయ్య, తంగి ఎర్రమ్మ, ఐఎన్‌డీ ప్రసాద్, మంగిపూడి శ్రీనివాసరావు, కథా నిలయం తరపున దాసరి రామచంద్రరావు, ఇస్కాఫ్ ప్రతినిధి ఎం.వి.మల్లేశ్వరరావు, పెన్షనర్ల సంఘం ప్రతినిధి దుర్గరాజు, జలుమూరు సత్యం, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి మజ్జి రామారావు పాల్గొన్నారు.

అట్టాడ అప్పలనాయుడుకు సత్కారం



అప్పలనాయుడును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్:

కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు, వైఎస్సార్ జీవితకాల సాఫల్య పురస్కారానికి ఎంపికైన ప్రసిద్ధ కథ, నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడుకు న్యాయవాద, జర్నలిస్టు సంఘాల నేతలు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషా వికాసానికి కృషి చేస్తున్న అప్పలనాయుడుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక చేయడం సముచితమన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాలను ప్రజలు ఆదరించాలని, ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలని కోరారు. కథలు, కవితలు, పద్యాలు, నవలలను పెద్దలతో పాటు పిల్లలూ చదివేలా ప్రోత్సహించాలన్నారు.కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్, జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బెజ్జిపురపు ఫల్గుణరావు, ఉత్తరాంధ్రా జర్నలిస్టుల ఫ్రంట్ అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు మామిడి క్రాంతి, కూన అన్నంనాయుడు, కడగల రాంబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కవలలకు జన్మనిచ్చి గర్భిణి మృతి

బూర్జ : మండలంలో నీలాదేవిపురం గ్రామానికి చెందిన వావిలపల్లి భాగ్యలక్ష్మి (43) ప్రసవానంతరం శ్రీకాకుళం ప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. భాగ్యలక్ష్మి హైరిస్క్ గర్భిణి కావడంతో నెలలు నిండిన తర్వాత డెలివరీ కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ 17న సిజేరియన్ చేశారు. కవల పిల్లలు పుట్టారు. ఇంతలో పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈమెకు భర్త నీలకంఠ ఉన్నారు. భాగ్యలక్ష్మి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బస్సుయాత్ర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పిరియా సాయిరాజ్. చిత్రంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఈ నెల 26న ప్రారంభంకానున్న సామాజిక న్యాయ బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తురామారావు పిలుపునిచ్చారు. సోంపేటలోని సంస్కార భారతి కళాశాల ఆవరణలో నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ లక్ష్మణమూర్తి, పార్టీ నాయకులతో కలిసి ఆదివారం బస్సుయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్ఛాపురంలో మధ్యాహ్నం 3 గంటలకు బస్సుయాత్ర ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో ప్రధాన పదవులు వెనుకబడిన తరగతులకు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సీడాప్ చైర్మన్ శాడి శ్యాంప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కులగణనపై హర్షం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్ర ప్రభుత్వం కులగణనపై నిర్ణయం తీసుకోవడంపై రెల్లి కుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో సమావేశం నిర్వహించారు. కులాల వారీగా గణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అభినందనలు తెలిపారు. సమావేశంలో రెల్లి కుల సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి మోహనరావు, గండి విజయకుమార్, జడలగడుగుల శ్రీనివాసరావు, అడప మోహనరావు, మజ్జి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి



సమాఖ్య సభ్యులతో ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాలో మాజీ సైనికులు, వీరమాతలు, వారి కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు జిల్లా మాజీ సైనిక సమాఖ్య అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పెద్ద రెల్లివీధిలో జిల్లా సైనిక సంక్షేమాధికారి కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్ భవనం ఆధునికీకరణ విషయమై ఎంపీ రామ్మోహన్‌నాయుడు వద్ద స్పందించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఫరీదుపేటలో మాజీ సైనికుల భవన నిర్మాణానికి 3 సెంట్ల స్థలాన్ని కేటాయించిన ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవికి ధన్యవాదాలు తెలిపారు. సెంట్రల్ గవర్నమెంట్ ప్రాజెక్ట్ ఇంటిగ్రేటెడ్ సైనిక భవన్‌కు 73 సెంట్ల స్థలాన్ని కేటాయించిన మంత్రి ధర్మాన ప్రసాదరావుకు, స్థల సేకరణలో సహకరించిన కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో అమర జవాన్ స్మారక స్థూపాన్ని అన్ని మండల యూనియన్‌ల సహాయ సహకారంతో ఏర్పాటు చేద్దామని తీర్మానించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల జిల్లా సమాఖ్య చైర్మన్, గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు (రిటైర్డ్), ఉపాధ్యక్షుడు విరోధుల సూర్యనారాయణ, కోశాధికారి ఐ.ఢిల్లేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పి.మురళీధర్‌రావు, ఫైనాన్షియల్ అడ్వైజర్ ఎ.వి.జగన్మోహన్‌రావు, కరస్పాండెంట్ టి.జనార్దన్ రావు, ఎస్.లక్ష్మణరావు, బి.ఈశ్వరప్రసాద్, డి.వాసు, రామకృష్ణ, మహిళా సెక్రటరీ పి.పద్మావతి, కె.జగ్గమ్మ, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235